సాక్షి విశాఖపట్నం

ఆదివారం : 16 : జూన్ : 2024



ఏపీ చాంబర్స్ ఎంవోయూ

నగరంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తో ఏపీ చాంబర్స్ విశాఖపట్నం ఎంవోయూ కుదుర్చుకుంది. 8లో



సారూ.. ఇదేం తీరు..!

8లో

కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఫ్రెండ్లీగా ఉంటుందని చెబుతున్నా ఆచరణలో మాత్రం మరోలా నిర్ణయాలు వెలువడుతున్నాయి.



సాగర తీరంలో సాయి పల్లవి

రామాద్రి బీచ్ తీరంలో ఏర్పాటు చేసిన సెట్‌లో శనివారం 'తండేల్' సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. 8లో

న్యూస్‌రీల్

ఫాదర్స్‌డే శుభాకాంక్షలు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి



దాబాగార్డెన్స్: పిల్లలు విజయం సాధించినప్పుడు పది మందికి గొప్పగా చెప్పుకునే వ్యక్తి, ఓడినప్పుడు భుజాలు తట్టి ధైర్యం చెబుతూ దగ్గరకు హత్తుకునే వ్యక్తి ఒక్క నాన్నేనని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఏటా జూన్ 3వ ఆదివారం పితృ దినోత్సవం జరుపు**కుంటామని, ఈ సం**దర్భంగా నగర ప్రజల**కు ఆమె ఫాదర్స్ డే** శుభాకాంక్షలు తెలిపారు. **తమ పిల్లలు ఉన్నత** స్థితికి తీర్చిదిద్దేందుకు త**ండ్రి చేసే ప్రయత్నం** విలువ కట్టలేమని, అమ్మ **నవ మాసాలు మోసి** ప్రాణం పోస్తే, నాన్న తన **పిల్లల జీవన గమనా**నికి నిరంతరం పాడుప**డతారన్నారు. బిడ్డల** కోసం తాను కరుగుతూ **ఇంటికి వెలుగునిచ్చే** మహోన్నత వ్యక్తి నాన్న అ**ని, తప్పటడుగులను** సరిదిద్ది బిడ్డల భవిష్యత్ **కోసం తపన పడే** నిస్వార్థపు వ్యక్తని పేర్కొ**న్నారు. నగర ప్రజలు** ఫాదర్స్ డే వేడుకలు జరు**పుకోవాలని మేయర్** అభిలషించారు.

నేటి నుంచి ఆఈట్ రెండో దశ ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సెల్ఫ్ సపోర్ట్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఖాళీల వివరాలను ఈ నెల 21వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఇవ్వాలి. రెండో దశ సీట్ల కేటాయింపు ఈ నెల 27న జరుపుతారు. ప్రవేశాలు పొందిన వారు ఈ నెల 28 నుంచి జూలై 4వ తేదీ వరకు నిర్ణీత ఫీజుల చెల్లించాల్సి ఉంటుంది.

కొనసాగిన స్కూల్ బస్సుల తనిఖీలు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: పాఠశాలలు, కళాశాలల బస్సుల తనిఖీలు మూడో రోజైన శనివారం నగరంలోని ఐదు ప్రాంతాల్లో కొనసాగాయి. అయితే తనిఖీ చేసిన బస్సుల యాజమాన్యాలు అన్ని నిబంధనలు పాటిస్తున్నట్లు గుర్తించామని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో 10 బస్సులపై కేసులు నమోదు చేసి, ఓ బస్సును సీజ్ చేశామని పేర్కొన్నారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులు, ఆటోల్లో ఎక్కించొద్దని సూచించారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు ప్రవీణ్ కుమార్, సుధీర్, సుమన్ కుమార్, లలిత, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కేవీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 18,19 తేదీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. 18న పీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కామర్స్, ఎకనామిక్స్ ఉపాధ్యాయులకు, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, గణితం, సైన్స్, సోషల్ సైన్స్ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 19న పీఆర్‌టీ, పీజీటీలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, డాన్స్ కోచ్, స్పోర్ట్స్ కోచ్, స్పెషల్ ఎడ్యుకేటర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, నర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి వరకు దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు విద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.



నగరంలో మెరుపులు

గాలివాన బీభత్సం!



- అకస్మికంగా దంచి కొట్టిన వర్షం
- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు
- భయకంపితులైన నగర వాసులు



ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్టు

సాక్షి, విశాఖపట్నం: గాలి, వాన బీభత్సం సృష్టించింది. శనివారం సాయంత్రం నగరాన్ని తీవ్రంగా వణికించింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగింది. నగరంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది సాధారణంకంటే 5 డిగ్రీలు అధికం. దీంతో తీవ్ర అసౌకర్య వాతావరణం నెలకొంది. సాయంత్రం 5 గంటలకు వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమైంది. కారుమబ్బులు ఆవరించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. కాసేపటికే ఈదురు గాలులు మొదలై ఉధృతరూపం దాల్చాయి. పెనుగాలుల ధాటికి పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు నేల కూలాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. మరోవైపు ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు దడ పుట్టించాయి. ఆ వెంటనే జడివాన మొదలైంది. కొంతసేపు కొన్ని ప్రాంతాల్లో కుండపోత కురిసింది. ఇలా దాదాపు రెండు గంటల పాటు వాన కొనసాగింది. ఇలా గాజువాకలో 10.5 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఇంకా ఆరిలోవలో 2.5, సింహాచలం 2.2, పెందుర్తి, సీతమ్మధార 2.0, మహారాణిపేట 1.7, పెదగంట్యాడలో 1.4 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. ఆదివారం కూడా నగరంలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది.



ఏయూ మైదానంలో బలంగా వీస్తున్న గాలులు



రైల్వే స్టేషన్ రోడ్డులో ఈదురు గాలులకు కూలిన చెట్టు



గాలులకు దెబ్బతిన్న హోర్డింగ్

మత్స్యకార భరోసాపై అలజడి!

- 13,530 మందిలో 2,061 మందికి నిలిపివేత
- బోట్లకు డీజిల్ వాడలేదని అనర్హత
- బయో డీజిల్ వినియోగమే కారణం
- లబోదిబోమంటున్న మత్స్యకారులు



వాసుపల్లికి వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే భరోసా సొమ్ము చెల్లింపుల్లో కోత విధించడంపై మత్స్యకారుల్లో తీవ్ర అలజడి రేగుతోంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 అర్ధరాత్రి వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపలవేటపై నిషేధం అమలవుతుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవన భృతికి ఇబ్బంది కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు చెల్లిస్తోంది. వేట విరామం అమలులోకి వచ్చాక మత్స్యశాఖ లబ్ధిదార్ల ఎంపిక (ఎన్యూమరేషన్) చేపట్టి అర్హుల జాబితాను రూపొందిస్తుంది. ఆ మేరకు ఈ భరోసా సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తుంది. మెకనైజ్డ్ (మర) బోట్లకు ఎనిమిది మంది, మోటారైజ్డ్ బోట్లకు ఆరుగురు, నాన్ మోటారైజ్డ్ బోట్లకు ముగ్గురు చొప్పున కలాసీలు/సిబ్బందిని మత్స్యకార భరోసాకు అర్హులుగా చేస్తారు. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి (భీమునిపట్నం నుంచి యారాడ వరకు ఉన్న తీర ప్రాంతంలో) సముద్రంలో చేపలవేట సాగిస్తున్న వివిధ రకాల బోట్లు 2,267 వరకు ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది 13,530 మందిని మత్స్యకార భరోసా కింద భృతి సొమ్ము పొందడానికి తొలుత అర్హులుగా మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. అయితే మత్స్యకార భరోసా సొమ్ము పొందాలంటే సంబంధిత బోటు ప్రభుత్వం నిర్దేశించిన బంకుల నుంచి డీజిల్ వేయించుకోవాల్సి ఉంటుంది. దీనికోసం వీరికి ఒక కార్డును కూడా ఇస్తారు. ఆ కార్డులో సంబంధిత బంకులో డీజిల్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం డీజిల్ ధర లీటరు రూ.100 వరకు ఉంది. ఇందులో ప్రభుత్వం లీటరుపై రూ.9 సబ్సిడీ ఇస్తోంది. అయితే విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో బోట్లకు డీజిల్ సరఫరా చేసే బంకు ఆప్కాఫ్ ఆధ్వర్యంలో నడుస్తోంది. ప్రభుత్వం ఇచ్చే రూ.9 సబ్సిడీలో రూ.1.50 ఆప్కాఫ్ నిర్వహణ చార్జీల కింద తీసుకుంటోంది. దీంతో ఈ మత్స్యకారుడికి డీజిల్ సబ్సిడీ రూ.9కి బదులు రూ.7.50 మాత్రమే వస్తోంది. దీంతో కొంతమంది మత్స్యకారులు లీటరు రూ.80కే లభ్యమవుతున్న బయోడీజిల్ వైపే మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి వారంతా సాధారణ డీజిల్‌ను వినియోగించడం లేదని వారికిచ్చిన కార్డుల ద్వారా మత్స్యశాఖ రికార్డుల్లో నమోదవుతోంది. ఫలితంగా మత్స్యకార భరోసా అర్హుల జాబితా నుంచి తొలగిస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి తలెత్తినప్పుడు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారి పట్ల సానుకూలంగా స్పందించి కొద్దిరోజుల్లో భరోసా సొమ్మును అందజేసేది. దీంతో వారు ఊరట చెందేవారు. తాజాగా ఈ ఏడాది ఇలా 2,061 మంది మత్స్యకారులు మత్స్యకార భరోసాకు అనర్హులుగా తేల్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరికి జీవన భృతి కింద ఇచ్చే రూ.10 వేలకు నోచుకోక పోవడంతో వీరు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

వాసుపల్లికి వినతి

బాధిత మత్స్యకార కలాసీలు శనివారం విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. దీనిపై ఆయన వెంటనే కలెక్టర్ ఎ.మల్లికార్జునతో ఫోన్‌లో సంప్రదించారు. వీరి సమస్య పరిష్కరించి వీరందరికీ భరోసా సొమ్ము అందేలా చూడాలని కలెక్టర్‌ను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో బాధిత మత్స్యకారులంతా భరోసా సొమ్ము కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

నేడు యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

- 26 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

8లో

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



కాలర్‌తో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు తన ఛాంబర్ నుంచి డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి 17 మంది కాలర్స్ ఫోన్ చేసి తమ సమస్యలను సీపీకి వివరించారు. భార్యాభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారానికి నగదు ఇచ్చి మోసపోవడం, ట్రాఫిక్ సమస్యలు వంటి వాటిపై ఫిర్యాదులు అందాయి. మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు వృద్ధుల కోసం నిర్వహించిన కార్యక్రమంలో ఆరుగురు ఫోన్ చేసి పలు సమస్యలను సీపీ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటిపై సంబంధిత అధికారులతో సీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు.

19 నుంచి ఐటీఐ కౌన్సెలింగ్



కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ

కంచరపాలెం: విశాఖ జిల్లాలోని మూడు ప్రభుత్వ, 29 ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశాలకు ఈ నెల 19 నుంచి 26 వరకు కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఆన్‌లైన్‌లో 3,982 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 3,398 మంది మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారన్నారు. అభ్యర్థుల మొబైల్ ఫోన్లకు సమాచారం పంపించామని, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, వెరిఫికేషన్ ఫారంతో కింది తెలిపిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

తేదీ	సమయం	ర్యాంక్ నంబర్లు
19	ఉ. 8.00	1 నుంచి 266
	మ.1.00	267 నుంచి 532
20	ఉ. 8.00	533 నుంచి 892
	మ.1.00	893 నుంచి 1,278
21	ఉ. 8.00	1,279 నుంచి 1,613
	మ.1.00	1,614 నుంచి 1,946
22	ఉ. 8.00	1,947 నుంచి 2,309
	మ.1.00	2,310 నుంచి 2,644
23	ఉ. 8.00	2,645 నుంచి 3,035
	మ.1.00	3,036నుంచి 3,398
24	ఉ. 8.00	బాలికలు, స్టీల్‌ప్లాంట్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ర్యాంక్ నంబర్ 1 నుంచి 892
25	ఉ. 8.00	మిగులు ర్యాంకుల అభ్యర్థులు ర్యాంక్ నంబర్ 893 నుంచి 2309
26	ఉ. 8.00	మిగులు ర్యాంకుల అభ్యర్థులు 2,310 నుంచి 3,398

బండారు వర్గీయులను ఆహ్వానిస్తే సహించబోం

- ప్రభుత్వ కార్యక్రమాల్లో తనకు స్థానం ఉండాలి
- కూటమి పార్టీలవి ఎవరి కార్యక్రమాలు వారివే.!
- కూటమి ఆత్మీయ సమావేశంలో గండి బాబ్జీ

పరవాడ : '2016లో నేను టీడీపీలో చేరాను. కానీ అప్పుడు టీడీపీ పెందుర్తి ఎమ్మెల్యేగా ఉన్న బండారు సత్యనారాయణమూర్తి కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా నన్ను ఆహ్వానించలేదు. అడుగడుగునా నా అనుచరులను వేధించారు. ఇప్పుడు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పెందుర్తి నియోజకవర్గంలో బండారు వర్గీయులకు ప్రాధాన్యమివ్వాలని అంటున్నారు. నేను ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నాను. నియోజకవర్గంలో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా ఎంపీగా సీఎం రమేష్, ఎమ్మెల్యేగా పంచకర్ల రమేష్‌బాబుతో పాటు టీడీపీ ఇన్‌చార్జిగా నాకూ ప్రాధాన్యం ఉండాల్సిందే. వేరే చోట గెలిచిన వారికి ఇక్కడ ప్రాధాన్యం ఇస్తే సహించబోం' అంటూ పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ కుండబద్దలు కొట్టారు. అధికారం కోసం మూడు పార్టీలు జత కట్టాయి తప్ప పార్టీ కార్యక్రమాలు ఎవరివి వారు చేసుకోవాల్సిందే.. దానికి నియోజకవర్గంలో బాధ్యులుగా ఉన్న వారే నిర్వహించాలని తేల్చి చెప్పారు. పరవాడలో కూటమి కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో భాగంగా గండి బాబ్జీ ఈ వ్యాఖ్యలు చేశారు. బండారు సత్యనారాయణమూర్తి గతంలో అధికారంలో ఉన్నప్పుడు తనకు గానీ..తన అనుచరులకు గానీ కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని.. ఇప్పుడు వారికి ఆహ్వానాలు, ప్రాధాన్యం ఇస్తే పార్టీ నిర్ణయానికి వ్యతిరేకమని తెలుసుకోవాలని చెప్పారు. పార్టీ ఇన్‌చార్జి నిర్ణయాల మేరకే నియోజకవర్గంలో సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కూటమి తరఫున ఎంపీగా పోటీ చేసి గెలిచిన బీజేపీ నేత, ఎంపీ సీ.ఎం రమేష్, ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన జనసేన నేత, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వారి వారి పార్టీల కార్యక్రమాలు జరుపుకోవడం వారిష్టమని చెప్పారు. కానీ ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రం తాము ముగ్గురం హాజరవుతామన్నారు. కాగా మాడుగులలో టీడీపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పెందుర్తి నియోజకవర్గానికి సంబంధం లేదని ఎంపీ, ఎమ్మెల్యేల సమక్షంలోనే గండి బాబ్జీ ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

నేడు యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

మహారాణిపేట: జిల్లాలో యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష జరగనుంది. మొత్తం 9,635 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఆయా కేంద్రాల్లో వసతులు కల్పించి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 11 మంది రూట్ ఆఫీసర్లు, 26 మంది లైజన్ ఆఫీసర్లు, 26 సూపర్‌వైజర్లను నియమించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు.

సాగర తీరంలో సాయి పల్లవి

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేటలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రామాద్రి బీచ్ తీరంలో ఏర్పాటు చేసిన సెట్‌లో శనివారం తండేల్ అనే సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీకాకుళంలోని మత్స్యకారుల వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ వేసిన సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకున్నారు. మరో నాలుగు రోజుల పాటు ఇక్కడ ఈ సినిమా షూటింగ్ జరుగుతుందని తండేల్ చిత్ర యూనిట్ తెలిపింది.

సారూ.. ఇదేం తీరు..!

'నగరానికి చెందిన హరినారాయణకు డీఎస్సీ–98 ద్వారా టీచర్(ఎంటీఎస్) ఉద్యోగం లభించింది. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనందున తప్పనిసరి పరిస్థితుల్లో విశాఖ నుంచి అల్లూరి జిల్లా ఏజెన్సీలో పోస్టింగ్ తీసుకున్నారు. జులై 31న ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. తాజాగా కొనసాగింపు ఉత్తర్వులు అందినా, నెలన్నర రోజుల కోసమని కుటుంబాన్ని వదిలి అటవీ ప్రాంతానికి వెళ్లక తప్పటం లేదు. ఈ ఏడాది కాలంలో ఇలా చాలా మంది రిటైర్ అవుతున్నారు. ఏజెన్సీకి పంపించటమే కాకుండా, రూ.110లు జ్యుడిషియల్ ఒప్పంద పత్రం సమర్పించాల్సిందనే ఉత్తర్వుల్లో పేర్కొనటంపై ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు.'

- డీఎస్సీ–98 ఉపాధ్యాయులకు ఆశనిపాతం
- పాతకేళ్ల తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు
- గత ఉత్తర్వులకు భిన్నంగా పోస్టింగ్‌లు
- రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నవారూ అడవిబాట
- ఆందోళనలో ఉపాధ్యాయులు. కౌన్సెలింగ్ కోసం డిమాండ్


శిక్షణ తరగతుల్లో డీఎస్సీ–98 ఉపాధ్యాయులు

విశాఖ విద్య: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఫ్రెండ్లీగా ఉంటుందని చెబుతున్నా ఆచరణలో మాత్రం మరోలా నిర్ణయాలు వెలువడుతున్నాయి. డీఎస్సీ–98 ఉపాధ్యాయుల విషయంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులతో వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న వారు సైతం విశాఖ నగరం నుంచి ఏజెన్సీ ప్రాంతానిని వెళ్లక తప్పని పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వచ్చిన ఉద్యోగాలు కాబట్టి, ఎక్కడ కొలువులు ఊడిపోతాయోననే ఆందోళనతో తమ సమస్యను చెప్పుకోలేక డీఎస్సీ–98 ఉపాధ్యాయులు లోలోన మదనపడుతున్నారు.

పాతికేళ్లకు దక్కిన ఉద్యోగాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పాతికేళ్ల సమస్యకు మోక్షం కలగటంతో గతేడాది జూన్ నెలలో డీఎస్సీ–98 వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. మినిమమ్ టైం స్కేల్(ఎంటీఎస్) కింద నెలకు రూ.32,670లు వేతనం పొందుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అర్హత సాధించిన 288 మందికి నాడు ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చారు. అయితే విశాఖ జిల్లాలో ఖాళీలు లేవనే కారణంతో 200 మంది వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా(ఏజెన్సీ ప్రాంతం)కు కేటాయించారు.

సొంత ప్రాంతాల్లో పోస్టింగ్ ఇమ్మన్నా..

మినిమమ్ టైం స్కేల్ కింద పనిచేస్తున్నందున స్థానిక నివాసాలకు సమీపంలో పోస్టింగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని 15–06–2023న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సైతం ఉత్తర్వులు జారీ చేసినా, విశాఖ జిల్లాలో ఖాళీలు లేవని విద్యాశాఖాధికారులు తెలపడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో డీఎస్సీ–98 ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లారు. ఈ ఏడాది తమకు న్యాయం చేస్తారని అంతా భావించారు.

కౌన్సెలింగ్ కోసం ఆరాటపడినా..

డీఎస్సీ–98 కాంట్రాక్టు టీచర్స్‌కు 2024–25 విద్యా సంవత్సరంలోనూ కొనసాగిస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్సీ–2008 వారితో కలిపి అందరినీ 11 నెలల కాలానికి విధుల్లోకి తీసుకుంటూ, గత ఏడాది పనిచేసిన స్థానాల్లోనూ పోస్టింగ్‌లు కేటాయిస్తూ ఉమ్మడి జిల్లా స్థాయిలో సర్వీసు పరమైన వ్యవహారాలు చూసే విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ ఈ నెల 13న ఆదేశాలు ఇచ్చారు. 2024–25 విద్యా సంవత్సరానికి 1998, 2008 డీఎస్సీల వారికి కలిపి కౌన్సెలింగ్ ప్రాతిపదికన పోస్టింగ్ ఇస్తారని అంతా భావించినా, ఏ ఒక్కరూ తమ గోడు పట్టించుకోకపోవటం సరైంది కాదని ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రస్తుతం డీఎస్సీ కోసం ఖాళీల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నందున గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా సొంత గ్రామాలకు దగ్గరలో ఉన్న ఖాళీల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

తెలుగు సాహిత్యానికి కొత్త మలుపు శ్రీశ్రీ

సీతంపేట: తెలుగు సాహిత్యానికి కొత్త మలుపు శ్రీశ్రీ అని ప్రముఖ సాహితీ విమర్శకుడు ఆచార్య చందు సుబ్బారావు అన్నారు. చందు సుబ్బారావు సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'ఆధునిక సాహిత్య వైతాళికుడు శ్రీశ్రీ' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ శ్రీశ్రీ సమాజానికి గొప్ప సంస్కరణలు నేర్పించాడని గుర్తుచేశారు. సోషలిస్టు దేశాల పరిస్థితులపై శ్రీశ్రీ రాసిన కవితలు, రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వంపై రచయిత, కవి పురిపండ అప్పలస్వామి ప్రభావం ఉందన్నారు. కవులకు కొత్త ఆలోచనా ధోరణి నేర్పించారని, తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించారని కొనియాడారు. కవులు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కవితలు రాయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ కవి, రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గరిమెళ్ల నాగేశ్వరరావు మాట్లాడు తూ ఎవరైతే ఈ ప్రపంచాన్ని ఒక్క అడుగు అయినా ముందుకు నడిపించారో ఆయనే మహాకవి శ్రీశ్రీ అని అన్నారు. ప్రముఖ కథకుడు మేడా మస్తాన్‌రెడ్డి చెప్పిన శ్రీశ్రీ చలోక్తులు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గరిమెళ్ల నాగేశ్వరరావుకు చందు ట్రస్ట్ ప్రోత్సాహక పురస్కారం ప్రదానం చేసారు. సంస్థ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, శ్యాంసుందర్, విశాలాంధ్ర రాజు పాల్గొన్నారు.


గరిమెళ్ల నాగేశ్వరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య చలం, చందు సుబ్బారావు

విజన్ ఎయిడ్ ఇండియా సేవలు భేష్

సీతంపేట: విజన్ ఎయిడ్ ఇండియా 20 ఏళ్లుగా అంధులకు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. విజన్ ఎయిడ్ ఇండియా సంస్థ 20వ వార్షికోత్సవ సభ శనివారం బుల్లయ్య కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారిలో ఆత్మస్థైర్యం నింపేలా.. మరొకరి సాయం లేకుండా స్వతంత్రంగా జీవించేలా విజన్ ఎయిడ్ సంస్థ అవసరమైన చర్యలు, ప్రత్యేక శిక్షణ ఇస్తోందన్నారు. ఈ 20 ఏళ్లలో ఎంతో మందికి స్మార్ట్ విజన్ గ్లాసెస్ అందజేయడం, వారికి ఉపాధి కల్పిస్తోందన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అవసరాల శ్రీనివాస్ విజన్ ఎయిడ్ ఇండియా చేపట్టిన సేవా కార్యక్రమాలు, మైలురాళ్లను వివరించారు. రోటరీక్లబ్ వాల్తేర్ సహకారంతో ఆరుగురు అంధులకు రూ.3.60 లక్షల విలువ చేసే స్మార్ట్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కళ్లద్దాలను ఉచితంగా అందించారు. అనంతరం సంస్థ గౌరవ అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు దంపతులను ఘనంగా సత్కరించారు. బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి, సంస్థ అధ్యక్షుడు ఎం.సీతారామ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.ఎల్.నరసింహం, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శామ్యూల్ బెన్ విక్టర్, ఈసీ సభ్యుడు వై.వి.రమణ, ప్రతినిధులు రాధిక, అవంతి పాల్గొన్నారు.



అంధులకు స్మార్ట్ విజన్ గ్లాసెస్ అందజేస్తున్న బాలమోహన్‌దాస్, ఎం.ఎస్.రాజు

'స్కిల్'ఇన్‌స్టిట్యూట్‌తో ఏపీ చాంబర్స్ ఎంవోయూ

ఎంవీపీకాలనీ: నగరంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తో ఏపీ చాంబర్స్ విశాఖపట్నం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు ఇరుసంస్థల ప్రతినిధులు ఎంవీపీకాలనీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఎంవోయూలో భాగంగా విద్యార్థులు, ట్రైనీల్లో నైపుణ్యం, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఏపీ చాంబర్స్ సేవలందిస్తుంది. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తన సభ్య పరిశ్రమల ద్వారా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు, పలు కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వనుంది. ఎస్‌డీఐ సీఈవో ఇంతియాజ్ అర్షద్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ విశాఖ జోన్ చైర్మన్ శ్రీనాథ్ చిట్టూరి తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.18.28 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ హుండీల ఆదాయం లెక్కింపు ప్రక్రియ శనివారం దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీషా ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం 28 రోజులకు గానూ రూ.18,28,509 వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే 228 గ్రాముల వెండి, 27 యూఎస్‌ఏ డాలర్లు, 20 సింగపూర్ డాలర్లు, 20 థాయ్ బాట్‌లు, 6 మలేషియా రింగిట్‌లు వచ్చినట్లు వెల్లడించారు. దేవదాయ శాఖ తనిఖీదారులు జి.వి.రమాబాయి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.చోళన్ పర్యవేక్షణలో శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు లెక్కించారు. ఆలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డి.ఎస్.ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.


హుండీల ఆదాయం లెక్కిస్తున్న శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

'అంగన్‌వాడీ' జిల్లా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి

డాబాగార్డెన్స్: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిటు) విశాఖ జిల్లా కమిటీ నూతన అధ్యక్షురాలిగా ఎం.వెంకటలక్ష్మిని ఎన్నుకున్నారు. సిటు కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. యూనియన్ అధ్యక్షురాలు వై.తులసి ఆకస్మిక మరణం కారణంగా నూతన అధ్యక్షురాలిని ఎన్నుకున్నారు. భీమిలి ప్రాజెక్టు నుంచి నరసియ్యమ్మ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలు లేవనెత్తిన న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ త్రిఫ్ట్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి నాగశేషు మాట్లాడుతూ త్రిఫ్ట్ నుంచి డెత్ బెనిఫిట్ కింద తులసి కుటుంబానికి రూ.40,493 అందజేశామన్నారు. సభ్యులందరూ త్రిఫ్ట్ సొసైటీలో చేరాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు పి మణి, ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, శోభారాణి, పద్మ పాల్గొన్నారు.



తులసి కుటుంబానికి త్రిఫ్ట్ నుంచి డెత్ బెనిఫిట్ అందజేస్తున్న బేబీరాణి, (ఇన్‌సెట్) నూతన అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

విశాఖ విమల విద్యాలయంపై కొనసాగుతున్న చర్చలు

ఉక్కునగరం: స్థానిక విశాఖ విమల విద్యాలయం కొనసాగింపుపై చర్చలు కొనసాగుతున్నాయి. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, నాయకుల మధ్య జరిగిన చర్చల్లో వారు తమ అభిప్రాయాలు తెలిపారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు శనివారం ఉదయం మూడు వర్గాల వారు హాజరయ్యారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ తాము ఆర్థిక భారం భరించలేమని, ఉక్కు యాజమాన్యం పాత పద్ధతిలో కొనసాగించడమో లేక ఉపాధ్యాయులు తమ జీతాలు తగ్గించుకోవడమో చేయాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు తమ సర్వీస్ రూల్స్‌పై కొంతమేర తగ్గారు. వేతనాలు, పీఆర్సీ, పాత బకాయిల చెల్లింపు తదితర అంశాలపై తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. నాయకులు మాట్లాడుతూ జీతాలు తగ్గించడం అన్యాయమన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల అభిప్రాయాలను ఉక్కు యాజమాన్యానికి వివరించి, వారికి నచ్చచెబుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నుంచి థామస్ పులిక్, వివిధ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, నమ్మి సింహాద్రి, కారు రమణ, విళ్లా రామ్మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు. మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పూండి–పలాస మెయిన్ లైన్, కోటబొమ్మాళి–తిలారు మధ్య జరుగుతున్న పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన పలాస–విశాఖపట్నం (07471) పాసింజర్, విశాఖపట్నం–పలాస(07471) పాసింజర్, విశాఖపట్నం –గుణుపూర్(08522) పాసింజర్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్, విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ఈ నెల 18వ తేదీన బ్రహ్మపూర్–విశాఖపట్నం (18525) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- సికింద్రాబాద్‌లో సోమవారం తెల్లవారు 4.30 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్‌– షాలిమర్ (07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 6.30గంటలకు బయల్దేరుతుంది.
- సికింద్రాబాద్‌లో ఆదివారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్– సంత్రగచ్చి (07234) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా సోమవారం తెల్లవారు 3.40 గంటలకు బయల్దేరుతుంది.